క్లుప్తంగా

కాలువల్లో పూడికల తొలగింపు



బంటుమిల్లి: బంటుమిల్లి, పెందుర్రు గ్రామాల పరిధిలోని పలు బ్రాంచి కాలువల్లో రైతులు స్వచ్ఛందంగా పూడిక తొలగింపు పనులు చేశారు. బంటుమిల్లి, పెందుర్రు బ్రాంచి కాలువలపై ఆయా గ్రామాలు తాగునీటి చెరువులు ఆధారపడి ఉన్నాయి. కాలువలు పూడటంతో మంచినీటి చెరువులకు నీరు నింపడం ఇబ్బందిగా మారింది. దీంతో రైతులు స్వచ్ఛందంగా ఎకరాల లెక్కన డబ్బు వసూలు చేసి రెండు కాలువల్లో పెద్ద ఎత్తున పేరుకుపోయిన మట్టి, జమ్ము, తూడు తదితర అడ్డంకులు తొలగించారు. దీంతో బంటుమిల్లి ప్రధాన కాలువకు నీరు విడుదల చేయడంతో స్పందించిన అధికారులు ఆయిల్ ఇంజిన్ల సాయంతో తాగునీటి చెరువులకు యుద్ధప్రాతిపదికన నీరు నింపే పనులు వేగంగా చేస్తున్నారు. నీటి విడుదల సమయం తక్కువగా ఉంటుందని ఇరిగేషన్ అధికారులు చెబుతున్న క్రమంలో పూడికలు తీయడంతో నీరు త్వరగా చేరుతోంది.

రోజువారీ ఆశీలు వసూలుపై వేలం

ఏడాదికి రూ. 6.48 లక్షల ఆదాయం

మోపిదేవి: మోపిదేవి పంచాయతీ కార్యాలయంలో రోజువారీ ఆశీలు వసూలుపై సర్పంచ్ నందిగం మేరీరాణి అధ్యక్షతన బహిరంగ వేలం పాట నిర్వహించారు. దీనిలో ఆరుగురు పాల్గొనగా అత్యధికంగా రావి హేమంత్ రూ.6,48,000కు కైవసం చేసుకున్నట్లు కార్యదర్శి రామకోటేశ్వరావు తెలిపారు. గతంలో రూ. 4,02,000.. ఈ ఏడాది అదనంగా రూ. 2,46,000 పంచాయతీకి ఆదాయం సమకూరినట్లు వివరించారు. ఉపసర్పంచ్ కోనేరు సుందరసింగ్, గ్రామస్తులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రహరీ నిర్మాణానికి విరాళం

చల్లపల్లి: చల్లపల్లి నారాయణరావు నగర్ కాలనీలో ముస్లింల శ్మశానవాటిక ప్రహరీ నిర్మాణానికి దాతలు విరాళమిచ్చారు. గురువారం సాయంత్రం స్థానిక కాలనీలోని గౌసియా మసీదులో కమిటీ పెద్దలకు దాతలు తోట కనకదుర్గ, తోట రాజశేఖర్, తోట నాగేశ్వరరావు రూ.10,116 విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో కమిటీ పెద్దలు పాల్గొన్నారు.

నివాళి



ఘంటసాల(తాడేపల్లి): మండలంలోని తాడేపల్లి గ్రామానికి చెందిన కొత్తపల్లి పీఏసీఎస్ చైర్ పర్సన్ తాతినేని వెంకట కృష్ణారావు తల్లి వెంకట నరసమ్మ ఇటీవల మృతి చెందారు. ఆమె జ్ఞాపకార్థ కూడిక గురువారం నిర్వహించగా కొడాలి కల్యాణ మండపంలో వెంకట నరసమ్మ చిత్రపటానికి ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు, కెప్టెన్ లక్ష్మి దంపతులు నివాళులర్పించారు. అనంతరం ఆమె కుమారులు తాతినేని వెంకట కృష్ణారావు, వెంకట సుబ్బారావు, బసవ శంకరరావును పరామర్శించారు. కార్యక్రమంలో ఘంటసాల మార్కెట్ కమిటీ చైర్మన్ వేమూరి వెంకట్రావు, జెడ్పీటీసీ తుమ్మల మురళీకృష్ణ, వైస్ ఎంపీపీ కుంపటి నాగేంద్ర బాబు, సచివాలయాల మండల కన్వీనర్ వేమూరి ప్రవీణ్, వైఎస్సార్ సీపీ సేవాదళ్ మండల అధ్యక్షులు దిరిశం పిచ్చేశ్వరరావు తదితరులు నివాళులర్పించారు.

ఆకట్టుకున్న ప్రవచనాలు

మచిలీపట్నంటౌన్: టీటీడీ, హిందూ ధర్మ ప్రచార పరిషత్ సంయుక్త ఆధ్వర్యాన మన గుడి కార్యక్రమంలో భాగంగా స్థానిక చిలకలపూడి శ్రీ విజయ సీతారామస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న శ్రీ మద్రామాయణ ప్రవచన సప్తాహ కార్యక్రమంలో భాగంగా రెండో రోజైన గురువారం ప్రవచన కార్యక్రమం నిర్వహించారు. శ్రీరాముడు ధర్మస్వరూపుడు అనే అంశంపై బ్రహ్మశ్రీ జోష్యుల వేణుమాధవ ప్రసాద్ చేసిన ప్రవచనం భక్తులను ఆకట్టుకుంది. కార్యక్రమాన్ని టీటీడీ ప్రతినిధి తురగా ప్రసాద్ పర్యవేక్షించారు.

మదరసా విద్యార్థులకు సాయం

చల్లపల్లి: స్థానిక అరబ్బీ మదరసా విద్యార్థులకు ఇస్లామిక్ హెల్పర్స్ సంస్థ ఆధ్వర్యాన సాయం అందజేశారు. గురువారం సాయంత్రం స్థానిక రజక బజారులోని అరబ్బీ మదరసాలో చదువుకుంటున్న పేద విద్యార్థులకు రూ.10 వేలను మదరసా నిర్వాహకులు మహమ్మద్ ఆరీఫ్‌కు అందజేశారు.

చేపల వేటపై నిషేధం

నాగాయలంక: దివిసీమ పరిధిలోని సముద్రజలాల్లో ఏప్రిల్14వ తేదీ అర్ధరాత్రి నుంచి మెకనైజ్డ్, మోటారు బోటులలో మత్స్యకారుల చేపలవేటపై 61రోజుల పాటు నిషేధం అమలు కానుంది. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు స్థానిక మత్స్యశాఖ సహాయ సంచాలకురాలు ఆర్.ప్రతిభ గురువారం తెలిపారు. దీనిపై దివిసీమలో చేపలవేట సాగించే మత్స్యకారులకు నోటీసులు జారీ చేశారు. చట్టాన్ని అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

భక్తిశ్రద్ధలతో రంజాన్



మచిలీపట్నంలో ఈద్గా వద్ద రంజాన్ ప్రత్యేక ప్రార్థనలు



బందరులో జరిగిన ప్రార్థనల్లో ఎంపీ అభ్యర్థి సింహాద్రి చంద్రశేఖరరావు, ఎమ్మెల్యే అభ్యర్థి పేర్ని కిట్టు



పెడనలో వైఎస్సార్ సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు చంద్రశేఖర్, రమేష్(రాము)



పెడనలో ప్రత్యేక ప్రార్థనలు



బంటుమిల్లి ఈద్గా మైదానంలో..



చినగుడుమోటులో జరిగిన ప్రార్థనల్లో సింహాద్రి వికాస్



శుభాకాంక్షలు చెప్పుకుంటున్న చిన్నారులు

మచిలీపట్నం, అవనిగడ్డ, పెడన నియోజకవర్గాల్లో ప్రత్యేక ప్రార్థనలు

మచిలీపట్నంటౌన్: రంజాన్ పండుగను నగరంలోని ముస్లింలు గురువారం భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. మచిలీపట్నంలోని ముస్తాఖాన్‌పేట ఈద్గా వద్ద ముస్లింలు ప్రార్థనలు చేశారు. ప్రభుత్వ ఖాజీ మొహమ్మద్ హుస్సేన్ పర్యవేక్షణలో మౌలానా మొహమ్మద్ వాజిద్ హుస్సేన్ సాహెబ్ ప్రార్థనలు చేసి రంజాన్ పండుగ విశిష్టతను వివరించారు. నగరంలోని పలు మసీదుల్లో ప్రార్థనలు నిర్వహించారు. ఈద్గా వద్ద ప్రార్థనల్లో వైఎస్సార్ సీపీ బందరు పార్లమెంట్ అభ్యర్థి డాక్టర్ సింహాద్రి చంద్రశేఖర్, అసెంబ్లీ అభ్యర్థి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు), చంద్రశేఖర్ కుమారుడు సింహాద్రి రామ్‌చరణ్, వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం జోనల్ ఇన్‌చార్జ్ షేక్ సలార్‌దాదా, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ షేక్ అచ్చెబా, పలు పార్టీల నేతలు హాజరయ్యారు. ఈ సందర్భంగా సింహాద్రి చంద్రశేఖరరావు, పేర్ని కిట్టు మాట్లాడుతూ అల్లా చూపిన మార్గంలో పయనించి ప్రతి ముస్లిం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఎన్నికల ప్రచారం కోసం రాజకీయ నాయకులమందరం ఎండలో తిరుగుతున్నామని అందరికీ మంచి ఆరోగ్యం అందించాలని దువాలో అల్లాను ప్రార్థించాలని ముస్లింలను వారు కోరారు. డాక్టర్ చంద్రశేఖరరావు ఉర్దూలో ప్రసంగించడం విశేషం. వారు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ప్రార్థనల్లో ఈద్గా కమిటీ అధ్యక్షుడు మొహమ్మద్ రఫీ, కార్యదర్శి అష్రఫ్ బాషా, కోశాధికారి హనీఫ్, సభ్యులు బాషు, రబ్బానీ, మొహిసిన్, మౌలాలి తదితరులు పర్యవేక్షించారు.

పెడనలో..

పెడన: పెడన – గుడివాడ జాతీయ రహదారి పక్కన ఈద్గాల వద్ద చిన్న ముతా, పెద్ద ముతా వేర్వేరుగా ప్రత్యేకంగా నమాజ్‌లు ఆచరించారు. వారి మతగురువులు రంజాన్ సందేశాన్ని వివరించారు. తొలుత ముస్లింలు బరస్తాన్‌ల వద్దకు వెళ్లి వారి తల్లిదండ్రులకు, బంధువుల పవిత్ర ఆత్మకు శాంతి కలిగి అల్లా వద్దకు చేరాలని ఆకాంక్షించారు. వైఎస్సార్ సీపీ బందరు పార్లమెంట్ అభ్యర్థి సింహాద్రి చంద్రశేఖరరావు, పెడన ఎమ్మెల్యే అభ్యర్థి ఉప్పాల రమేష్(రాము)లు ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. వారు ఈద్ ముబారక్ తెలియజేశారు. వీరితోపాటు పెడన పట్టణ కన్వీనర్ బండారు మల్లికార్జునరావు, మాజీ ఫ్లోర్ లీడర్ కటకం ప్రసాద్, కౌన్సిలర్లు, పార్టీ నాయకులు, అభిమానులున్నారు.

బంటుమిల్లి: స్థానిక జామియా మసీద్ కమిటీ ఆధ్వర్యాన గురువారం స్థానిక ఈద్గా మైదానంలో రంజాన్ పండుగ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు భక్తి, శ్రద్ధలతో జరిగాయి. మసీదు గురువు ముజఫర్ హుస్సేన్ ప్రత్యేక ప్రార్థనలు చేయించి పండుగ విశిష్టతను వివరించారు. ముస్లింలు నూతన వస్త్రాలు ధరించి సేమ్యాలు, మిఠాయిలతో పండుగను ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో మసీదు కమిటీ అధ్యక్షుడు, ఎంపీటీసీ ఎండీ కమాల్‌బాషా, సెక్రటరీ ఎండీ నజీర్‌ఖాన్, సభ్యులు అబ్దుల్ అలీం, ఎండీఅక్బర్, ఎండీ నజీర్, హాదిల్, బాబు, మాజీ సర్పంచ్ ఎండీ అమీర్, ఎండీ బాషా, సత్తార్, బాజీ తదితరులు పాల్గొన్నారు. ప్రార్థనల అనంతరం పేదలకు పలు రకాల దానాలు చేశారు. వైఎస్సార్ సీపీ పెడన ఎమ్మెల్యే అభ్యర్థి ఉప్పాల రమేష్(రాము) ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు.

నాగాయలంక: స్థానిక జుమా మసీదులో ముస్లింలు గురువారం భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మహ్మద్ ప్రవక్త సందేశాన్ని మసీదు ఇమామ్ అబ్దుల్ సత్తార్ చదివి మత నియమాలను వినిపించారు. మండల పరిషత్ మాజీ కోఆప్షన్ సభ్యుడు షేక్ జానీ, కమిటీపెద్దలు ప్రార్థనల్లో పాల్గొన్నారు.

ఘంటసాల(లంకపల్లి): మండల పరిధిలోని లంకపల్లి మసీదుతో పాటు ఘంటసాలలోని రెండు మసీదుల్లో రంజాన్ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించిన మత గురువులు రంజాన్ ప్రాముఖ్యాన్ని వివరించి శుభాకాంక్షలు తెలియజేశారు.

కోడూరు: మండలంలోని చినగుడుమోటు మసీదులో ముస్లింలు ప్రార్థనలు నిర్వహించి, ఈద్–ముబారక్ అంటూ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. వైఎస్సార్ సీపీ యువనేత సింహాద్రి వికాస్ ముస్లింలతో కలిసి రంజాన్ ప్రార్థనల్లో పాల్గొన్నారు. పెదగుడుమోటు, కోడూరు, నరసింహపురం మసీదుల్లో రంజాన్ ప్రార్థనలు ఘనంగా జరిగాయి.

చల్లపల్లి: స్థానిక నిమ్మలతోటలోని ట్రావెలర్స్ బంగళా వెనుక ఈద్గా మైదానంలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. చల్లపల్లి, లక్ష్మీపురానికి చెందిన ముస్లింలు ర్యాలీగా ఈద్గా మైదానానికి చేరుకున్నారు. అక్కడ ప్రత్యేక నమాజ్ చేశారు.

ముగిసిన గంగాభవాని జాతర



కోడూరు: కోడూరు గంగాభవానీ అమ్మవారి ప్రధాన జాతరోత్సవాలు గురువారం ముగిశాయి. ఈ నెల 9న పశువుల జాతర, 10 ప్రధాన గుడి జాతర నిర్వహించారు. ప్రధాన జాతరలో భాగంగా బుధవారం రాత్రి భక్తజనం అమ్మవారి దర్శనానికి పెద్దసంఖ్యలో తరలివచ్చారు. ప్రత్యేకంగా అలంకరించిన వాహనాలపై భారీ లైటింగ్‌తో ప్రభలను ఊరేగించి భక్తి భావం చాటుకున్నారు. యువకులు తీన్మార్ డ్యాన్సులు చేస్తూ సందడి చేశారు. రద్దీ అధికంగా ఉండటంతో ప్రధాన రహదారులపై ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. అవనిగడ్డ డీఎస్పీ మురళీధర్, సీఐ వెంకటత్రినాథ్, ఎస్ఐ శిరీష పర్యవేక్షణలో 80మంది పోలీసులు జాతరలో పటిష్ట బందోబస్తు నిర్వహించారు. అమ్మవారికి వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి సింహాద్రి చంద్రశేఖర్‌రావు తనయుడు యువనేత రామ్‌చరణ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురువారం ఉదయం గంగాభవానీ చిన్న అమ్మవారు ఆలయ ప్రవేశం చేయాల్సి ఉండగా, ఈ ఏడాది గ్రామోత్సవం ఆలస్యంగా సాగుతున్నట్లు ఆలయ ధర్మకర్త కోట యుగంధరరావు తెలిపారు. శుక్రవారం ఉదయం చిన్న అమ్మవారిని ఆలయ ప్రవేశం చేయించనున్నట్లు యుగంధరరావు చెప్పారు.

ముగ్గురు సారా విక్రేతల అరెస్ట్

కోనేరుసెంటర్: సారా విక్రయాలకు పాల్పడుతున్న ముగ్గురు వ్యక్తులను మచిలీపట్నం సెబ్ పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. సీఐ సత్యనారాయణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అధికారుల ఆదేశాల మేరకు గురువారం మచిలీపట్నం ఎక్సైజ్ శాఖ పరిధిలోని పలు ప్రాంతాల్లో నాటుసారా స్థావరాలపై సెబ్ పోలీసులు దాడులు చేశారు. దాడుల్లో నందమూరు గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు సారా కాస్తూ పోలీసులకు పట్టుబడ్డారు. వారి నుంచి 44 లీటర్ల సారాతో పాటు రెండు ద్విచక్రవాహనాలను పట్టుకుని సీజ్ చేశారు. సారా తయారీకి ఉపయోగించే సామగ్రిని స్టేషన్‌కు తరలించారు. పట్టుబడిన ముగ్గురిపై కేసు నమోదు చేసి కోర్టుకు తెలిపినట్లు సీఐ సత్యనారాయణ తెలిపారు. దాడుల్లో ఎస్సైలు స్వామి రెడ్డి, రాజశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

సంఘ సంస్కర్త పూలే



పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఉప్పాల రమేష్(రాము)



నివాళులర్పిస్తున్న బందరు ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు డాక్టర్ చంద్రశేఖరరావు, పేర్ని కిట్టు



అవనిగడ్డ వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు



మోపిదేవి గురుకుల పాఠశాలలో పూలే చిత్రపటానికి పూలమాల వేసిన పాఠశాల ప్రిన్సిపాల్ వీరరవి



ఎలక్ట్రికల్ ఈఈ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న ఈఈ భాస్కరరావు, సిబ్బంది



బీసీ సంక్షేమ సంఘ కార్యాలయంలో పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తూ..



నాగాయలంకలో పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

పెడన: సంఘ సంస్కర్త, సామాజిక కార్యకర్త జ్యోతిరావు పూలే జయంతి వేడుకలను పెడన వైఎస్సార్ సీపీ కార్యాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. పూలే చిత్రపటానికి పెడన వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఉప్పాల రమేష్(రాము)తో పాటు పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ జ్యోతిరావు పూలే బీసీల అభ్యున్నతికి విశేషంగా కృషి చేశారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ ఫ్లోర్‌లీడర్ కటకం ప్రసాద్, పార్టీ పట్టణ కన్వీనర్ బండారు మల్లికార్జునరావు, మాజీ ఎంపీపీ రాజులపాటి అచ్యుతరావు, దావు బైరవలింగం, పిచ్చిక సతీష్, శిరివెళ్ల జయేష్, ముత్యాల మురళి, కోడూరు శ్రీను, వాసు, బొడ్డు శ్యామల, నాగమణి, మాదవ్, అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నాగాయలంక: మండల బీసీ, ఎస్సీ వర్గాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో స్థానిక పార్కు సెంటర్‌లో పూలే జయంతి జరిగింది. కృష్ణా జిల్లా బీసీ సంక్షేమ సంఘం నేత చెన్ను రంగారావు, ఏపీ సంప్రదాయ మత్స్యకారుల సేవా సంఘం ప్రధాన కార్యదర్శి లకనం నాగాంజనేయులు మాట్లాడుతూ పూలే ఆదర్శాలను నేటి బహుజన యువత అందిపుచ్చుకోవాలని సూచించారు. తొలుత ఐక్య వేదిక కన్వీనర్ తానంకి పోతురాజు.. పూలే చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ –2 సభ్యుడు లంకె శ్రీనివాసప్రసాద్, ఎస్సీ నాయకులు దాసి జీవరత్నం, గుంటూరు సురేష్, పలువురు బీసీ నాయకులు పాల్గొన్నారు. స్థానిక పార్కు సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద జిల్లా బీసీ సేన, మాలమహానాడు ఆధ్వర్యంలో పూలే జయంతి చేశారు.

మోపిదేవి: స్థానిక గురుకుల పాఠశాలలో పూలే చిత్రపటానికి ప్రిన్సిపాల్ కె.వీరరవి పూలమాల వేసి సమాజానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మచిలీపట్నంటౌన్: పూలే జయంతి వేడుకలను గురువారం ఇనుగుదురుపేటలో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యాన ఘనంగా నిర్వహించారు. పూలే చిత్రపటానికి వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి డాక్టర్ చంద్రశేఖరరావు, ఎమ్మెల్యే అభ్యర్థి పేర్ని కిట్టు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కో–ఆప్షన్ సభ్యులు బేతపూడి రవి, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

■ నగరంలోని పంపులచెరువు వద్ద ఉన్న ఎలక్ట్రికల్ డీఈ కార్యాలయంలో పూలే జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పూలే చిత్రపటానికి ఎలక్ట్రికల్ ఈఈ మన్నెం భాస్కరరావు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈడేపల్లి బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యాన సంఘ జిల్లా అధ్యక్షుడు శేకుబోయిన సుబ్రహ్మణ్యం ఇతర నాయకులు పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు నిక్కు రాధాకృష్ణ, జన్ను గోవిందు, బోయిన రమేష్, ఎం.పవన్, బి.వెంకటస్వామి పాల్గొన్నారు.

చల్లపల్లి: స్థానిక సీఆర్ వికాస కేంద్రంలో పూలే చిత్రపటం వద్ద అంబేద్కరిస్ట్ దాసి సీతారామరాజు నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్సీ, బీసీ నాయకులు అడ్డాడ ప్రసాద్ బాబు, ఓగిరాల నాగమల్లేశ్వరరావు, ఉప్పాల సాంబశివరావు పాల్గొన్నారు.

అవనిగడ్డ: స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పూలే జయంతి వేడుకలు నిర్వహించారు. ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు.. పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ తుంగల సుమతీ దేవి, జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, వైస్ ఎంపీపీ పులిగడ్డ పిచ్చేశ్వరరావు, ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నలకుర్తి రమేష్, పార్టీ మండల కన్వీనర్ రేపల్లె శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆశీర్వదించండి .. అందుబాటులో ఉంటాం



కేపీటీపాలెంలో టీడీపీ నుంచి చేరినవారికి కండువాలు కప్పి వైఎస్సార్ సీపీలోకి ఆహ్వానిస్తున్న బందరు పార్లమెంట్ అభ్యర్థి సింహాద్రి చంద్రశేఖర్, అసెంబ్లీ అభ్యర్థి పేర్ని కిట్టు

కోనేరుసెంటర్: ఆశీర్వదించండి.. అండగా ఉంటామని వైఎస్సార్ సీపీ బందరు ఎంపీ అభ్యర్థి సింహాద్రి చంద్రశేఖరరావు, ఎమ్మెల్యే అభ్యర్థి పేర్ని కిట్టు ఓట్లు అభ్యర్థించారు. కేపీటీపాలెంలో గురువారం 'గడప గడపకు సంక్షేమం' జరిగింది. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని అఖండ మెజార్టీతో గెలిపించాలని వారు కోరారు. జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి అయితే రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి చేస్తారని తెలిపారు. బందరు అభివృద్ధి దృష్ట్యా పార్లమెంట్, అసెంబ్లీ అభ్యర్థులుగా తమను ఆశీర్వదించాలని కోరారు. కేపీటీపాలెం గ్రామానికి చెందిన సుమారు 50 మంది తిరుమలశెట్టి కుటుంబాలకు చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు పేర్ని కిట్టు ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీలో చేరారు. కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీ గ్రామ ఇన్‌చార్జ్ నిరీక్షణరావు, మాజీ జెడ్పీటీసీ లంకే వెంకటేశ్వరరావు, కన్వీనర్ శొంతి ఫరీద్ తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్ దరఖాస్తులు 15లోగా అందజేయాలి

- ఫారం 12తో ఓటరు ఐడీ, ఆధార్ కార్డుల జిరాక్స్‌లు జత చేయండి
- పెడన ఎన్నికల అధికారి వెంకటరమణ

పెడన: పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకున్న వారు వాటిని తిరిగి ఈ నెల 15వ తేదీలోగా అందజేయాలని పెడన ఎన్నికల అధికారి పి.వెంకటరమణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గంలో ప్రభుత్వ ఉద్యోగుల్లో పీవో, ఏపీవోలుగా విధులకు హాజరయ్యేవారు దరఖాస్తులను నందమూరులోని వాసవి ఇంజినీరింగ్ కళాశాలలో తీసుకుంటారని పేర్కొన్నారు. ఫారం–12 దరఖాస్తుతో పాటు ఓటరు ఐడీ, ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలను శిక్షణ కేంద్రానికి తీసుకువస్తే దరఖాస్తుతో పాటు శిక్షణ కేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్‌లో పోస్టల్ బ్యాలెట్ దరఖాస్తులను స్వీకరిస్తారని పేర్కొన్నారు. ఇతర జిల్లాల్లో విధులు నిర్వహిస్తున్న వారు పెడన నియోజకవర్గంలో స్థానికులై ఉండి వారు ఓటు హక్కును పోస్టల్ బ్యాలెట్ ద్వారా వినియోగించుకోవడానికి ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటు చేశామని వివరించారు. ఇది పెడన తహసీల్దార్ కార్యాలయంలో ఉంటుందన్నారు. ఉద్యోగానికి సంబంధించి ఐడీ కార్డు, ఓటరు ఐడీ కార్డు, ఆధార్‌కార్డ్ జిరాక్స్ కాపీలను ఫారం–12కు జతచేసి తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్‌లో ఇవ్వాలన్నారు. పెడన తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్‌కు ఇన్‌చార్జిగా ఏఈఆర్వో, పెడన తహసీల్దార్ రాంబాబును, అలాగే బంటుమిల్లి తహసీల్దారు వై.రవికుమార్‌ను నియమించామని వివరించారు. సందేహాలుంటే నివృత్తి కోసం బంటుమిల్లి తహసీల్దార్ రవికుమార్‌ను సంప్రదించాలని సూచించారు. ఆయన పెడన తహసీల్దార్ కార్యాలయంలోని ఆర్వో కార్యాలయం వద్ద ఉంటారని తెలిపారు. పెడన నియోజకవర్గంలో పీవోలు, ఏపీవోలుగా 1,438 మందిని నియమించినట్లు తెలిపారు. వీరికి 13న వాసవి ఇంజినీరింగ్ కళాశాలలో శిక్షణ ఉంటుందని, వీరందరికీ సమాచారం ఇచ్చినట్లు ఆర్వో పేర్కొన్నారు.

జోరుగా ఎన్నికల ప్రచారం



36వ డివిజన్‌లో ప్రచారం చేస్తున్న కార్పొరేటర్ మాచవరపు రాంప్రసాద్, నాయకులు



9వ డివిజన్‌లో కార్పొరేటర్ వాణిశ్రీ ఎన్నికల ప్రచారం

మచిలీపట్నంటౌన్: నగరంలోని 50 డివిజన్లలో గురువారం వైఎస్సార్ సీపీ ఎన్నికల ప్రచారం ముమ్మరంగా సాగింది. కార్పొరేటర్లు, డివిజన్ ఇన్‌చార్జ్‌లు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి మే 13న జరగనున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి అఖండ విజయం చేకూర్చాలని కోరారు. 13వ డివిజన్‌లో కార్పొరేటర్ గాజుల శ్రీదేవి, డివిజన్ ఇన్‌చార్జ్ గాజుల భగవాన్, 36వ డివిజన్‌లో కార్పొరేటర్ మాచవరపు రాంప్రసాద్, నాయకులు నూకల ప్రసాద్, ఎగ్గోని గాంధీ, దార్ల చెన్నకేశవరావు, దమ్ము కేశవరావు, చింతపట్ల నాని, కొమ్ముకూరి ప్రదీప్ ఇంటింటి ప్రచారం చేశారు. 8వ డివిజన్‌లో కార్పొరేటర్ శ్రీరాం చిన్న, 9వ డివిజన్‌లో కార్పొరేటర్ రాసంశెట్టి వాణిశ్రీ, 1వ డివిజన్‌లో కార్పొరేటర్ జోగి చిరంజీవి, మాజీ కౌన్సిలర్ బత్తిన వాసు తదితరులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

ప్రధాన కాలువలకు చేరుకున్న నీరు



వక్కపట్లవారిపాలెం వద్ద భావదేవరపల్లి సెంట్రల్ చానల్‌కు విడుదల చేసిన నీరు

నాగాయలంక: పంట కాలువల ద్వారా గ్రామాల్లో తాగునీటి అవసరాల కోసం జలవనరుల శాఖ విడుదల చేసిన నీరు గురువారం మండలంలోని ప్రధాన కాలువలకు చేరుకుంది. కాలువల్లో నీరు రావడంతో మండలంలో తొలిగా కమ్మనమోలు కాలువ ద్వారా గ్రామంలోని 14 గ్రామాల సామూహిక రక్షిత నీటి పథకం ద్వారా రిజర్వాయర్లలో నీటిని నింపడానికి ప్రాధాన్యమిస్తున్నట్లు ఇరిగేషన్ స్థానిక ఏఈ పి.రవితేజ చెప్పారు. దీని నిమిత్తం వక్కపట్లవారిపాలెం రెగ్యులేటర్స్(లాకులు)నుంచి ముందుగా భావదేవరపల్లి వైపు సెంట్రల్ చానల్‌కు వదిలి, తర్వాత గుల్లలమోద వైపు సౌత్‌చానల్‌కు నీటిని విడుదల చేస్తామని ఆయన వివరించారు. తొలి ప్రాధాన్యత క్రమంలో కమ్మనమోలు రిజర్వాయర్లను నింపుతామని స్పష్టం చేశారు.